# కాంపికథ

# ప్రేమలేఖ

అమ్మాయిల్లో ఎవర్ని లవ్ చెయ్యాలో రేపు సెలెక్ట్ చేయాలనుకొని నిర్ణయించి తెలుగు పుస్తకం అరవై ఎనిమిదో పేజీలో ప్రేమలేఖ పెట్టి పడుకున్నాడు



ప్రేమలేఖ రాయడం చాలా తేలిక—
కానీ అది చేరవేయడం చాలా కష్టం—
ఇది నేను తెల్సుకున్న నిజం

జింఢిం ప్రభాకర్ రావు

నా అందమైన దేవతా రాణీ!

నిన్ను చూసిన రోజు నుంచి నా మనసు చంద్రుని కొరకు అదేదో పక్షిలా నీ పొందుకోసం ఎదురుచూస్తోంది. నీ శక్తివంత

మైన చూపులు మన్మథ బాణాల్లా తగిలి నా గుండెల్ని తూట్లు పొడుస్తున్నాయి. ఈ ఉత్తరానికి జవాబు వ్రాస్తావు కదూ! యూ ఆర్ ఎ ఏంజెల్ అయ్ లవ్ యూ—

**నీ ఉత్తరం కోసం ఎదురుచూస్తూ—**

నీ

చ.

చలపతి అని నా పేరు రాసుకోడానికి భయం వేసింది.

ఉత్తరం జంపర్‌మే బంపర్‌గా రాశాను.

ఇప్పుడు నాకున్నది ఒకటే సమస్య.

ఎవరికి ఇవ్వాలి ఈ ఉత్తరం?

ఎదురింటి జలజకా?

**ఉగాది**

**కొంటె కథల పోటీలో**

**కన్సొలేషన్**

**బహుమతి పొందిన కథ**

పక్కింటి పారిజాతానికా? కొంచెం నాకంటే వయసులో పెద్దది. అయినా ఫరవాలేదు ప్రేమకు వయసేమిటి? నా బొంద. అడ్జస్టయిపోతా!

రోజూ బస్‌లో కనబడే పేరు తెలియని పోనీటైల్ పిల్లకా? మా క్లాస్‌లో రెండో బెంచీలో కూర్చునే రాధికకా? హారికా? రేణుకా? రంజని? ప్రమోదూతకా? ప్రభావతికా? ఎవరికివ్వాలి? ఈ బ్యూటిఫుల్ ఉత్తరం ఏ బ్యూటిఫుల్ గర్ల్‌కివ్వాలి? అందరూ అందమైన అమ్మాయిలే! ఏ అమ్మాయినైనా నేను ప్రేమించెయ్యగలను. అబ్బ! చుట్టూ ఇంతమంది అమ్మాయిలుంటే సెలెక్ట్ చేసుకోడం చాలా కష్టం. బి.కాం. చదువుతున్నాను. బోలెడు పర్సనాలిటీ వుంది. అచ్చుగాకపోయినా బోలెడు కథలు వ్రాశాను. ఇన్ని క్వాలిఫికేషన్స్‌తోబాటు ప్రేమ పేరెత్తితేనే జలదరించిపోయే మనసుంది. ఎవరో ఒకర్ని ప్రేమించి లవ్ గేమ్ ప్రారంభించకపోతే పిచ్చి పట్టేలా వుంది అందుకే లవ్ లెటర్ ప్రిపేర్ చేశాను. ఎవర్నో ఒకర్ని రేపటిలోగా సెలెక్ట్ చేసుకుని లవ్ లెటర్ బాణం వేయాలి.

వారఫలాల్లో ప్రేమలో జయిస్తారు అనివుంది. మీరు తలపెట్టిన కార్యక్రమాలు జయప్రదమౌతాయని కూడా వుంది. రెండు రోజుల్నించీ కుడికన్ను అదురుతోంది. కుడికన్ను అదిరితే మంచిదని మా బామ్మ చెప్పింది. ఈ మధ్య రొమాంటిక్ నవలలూ, సెక్స్ సినిమాలే చూడబుద్ధి అవుతోంది. ఇంత ప్రతిభవుండీ, ఇన్ని అర్హతలుండీ నేను ప్రేమలేఖ రాశాను. అల్లాటప్పాగా రాయలేదు. ఈ ఉత్తరం ఇచ్చిన తర్వాత ఆ అమ్మాయి నన్ను స్టడీ చేస్తుంది. లెటర్ ఇచ్చిన తర్వాత రెండు రోజులు ప్రటిప్‌గా డ్రస్‌లు మెయిన్‌టైన్ చేస్తా. అందులో ఢోకా లేదు. లాండ్రీ నుంచి బట్టలు తెచ్చుకుని రెడీగా వుంచుకున్నా. డబ్బులకి లోటులేదు. అమ్మని పీడించి సంపాదించా. ఫస్ట్ ఆ అమ్మాయిని సినిమాకి రమ్మంటే? అమ్మబాబోయ్! అంత పబ్లిగ్గానా? మా నాన్న అసలే ఛండశాసన ముండావాడు. ఎవడో చూసి చెబుతాడు. ఒళ్లు చీరేస్తాడు. వద్దు. మరి? ఎక్కడికెళ్ళాలి??

ఈ వూళ్లో సముద్రం లేదు. సముద్రముంటే బీచ్ వుండి చచ్చేదికదా! పోనీ గార్డెన్స్, పార్క్ ఛీ! అవీలేవు. పార్కులున్నాయిగానీ చెప్పుకోడానికి నాకే కంపరంగా వుంది. ఆ పార్క్‌లో పోకిరీగాళ్లు పులీ మేకా ఆడుతుంటే బిచ్చగాళ్లు గంజాయి దమ్ము కొట్టి ఫ్రీ ఓపెన్ ఎయిర్ లాడ్జింగ్‌లా ఎంజాయ్ చేస్తుంటారు. పూలమొక్కలూ, చెట్లుండక బీటలు వారిన నేల తప్ప! ఠఠ్! ఇదీ పెద్ద సమస్యగానే వుంది.


ప్రేమలేఖ ఇవ్వడం కష్టమైతే అవతల మన గ్రీన్ సిగ్నల్‌కి బయల్దేరిన అమ్మాయిని ఎక్కడికి తీసుకెళ్ళి మాట్లాడాలి? మా దరిద్రపు ఊరు ఇలాంటి విషయాలకి పనికిరాదని ఇప్పుడే తెలిసింది. ఓరి భగవానుడా?

ఈ ఊళ్లో ప్రేమించి నేనెలా బతికి బట్టకట్టేది దేవుడోయ్! ఆల్‌రైట్! శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు. ఇంటికన్నా, రోడ్డుకన్నా, సినిమాహాలుకన్నా గుడిపదిలం. ఆంజనేయస్వామి గుడి. నో, నో బ్రహ్మచారి దేవుడు. ఆడపొడ గిట్టదు. ఇలాంటి విషయాల్లో మనల్ని నాక్కేయగలడు. రాములోడి గుడి బెటరు. సీతమ్మ సెంటిమెంటులో ఇలాంటివి పట్టించుకోడు. ఉత్తగా ముట్టడమే కుదురుతుంది. టచింగ్స్, కిసింగ్స్ కుదరవుగదా! గుళ్లో పనీపాటా లేని భక్తులుంటారు ఫండాలంగా. పోనీ ఇప్పుడు ఉత్తగా స్వీట్ నథింగ్స్ చెప్పేసుకుని, మరుసటి రోజు ఇంకోచోట రొమాంటిక్ మీటింగ్ పెట్టుకుంటేసరి. ఆ మీటింగ్స్‌లోనే టచింగ్స్, కిసింగ్‌అలా— అలా వహ్వా— ఛ వెధవ ప్రేమ థాట్ వస్తేనే ఒళ్లు పులకరిస్తుంది వెధవది.

అమ్మాయిల్లో ఎవర్ని లవ్ చేయాలో రేపు సెలెక్ట్ చేయాలనుకొని నిర్ణయించి తెలుగు పుస్తకం అరవై ఎనిమిదో పేజీలో ప్రేమలేఖ పెట్టి పడుకున్నాడు.

** ** **

"లెమ్మను పింజారీ వెధవని ఇవాళ వాడిని నరికి పోగులు పెడతా, దరిద్రపు వాజమ్మని



ఛీ!'' ముందు హాల్లోంచి నాన్నగారి, రంకెలు విని ఉలిక్కిపడి లేచి బాత్‌రూమ్‌లోకి పరుగెత్తాను. బాత్‌రూమ్‌లోకి కూడా ఆయన రంకెలు వినబడుతున్నాయి. మా నాన్న తెలుగు మాష్టారు. కోపం వస్తే క్లాసులో కూడా ఇలాగే రంకెలు వేస్తాడు కాబట్టి ఆయన్నంతా 'పశుపతి', 'వృషభాసురుడు' అని పిలుస్తారు.

''ఏం జరిగిందమ్మా?'' అడిగాను అమ్మని.

''ఏమిటోరా నీ తెలుగు పుస్తకంలో పొద్దున్న ఏదో ఉత్తరం దొరికిందట అంతే! అది చూసినప్పటి నుంచీ తోక తెగిన గేదెలా అవే రంకెలు పాడు రంకెలు''

గుండె ఆగిపోయింది. అంటే నాన్నగారు నా ప్రేమలేఖ చూశారన్నమాట. అసలాయన తెలుగు పుస్తకం ఎందుకు చూడాలిట? అన్నీ ఇలాంటి బుద్ధులే నాన్నవి. ఛీ! ఛీ! భయంభయంగా హాల్లోకి వెళ్ళాను.

''రా! రా! సుపుత్రా! రా! ఈ లెటర్ నువ్వు రాసిందేనా? అంటే అప్పుడే ప్రేమలేఖలు రాసే మొగాడివయ్యావన్నమాట. అర్థాయుష వెధవా!'' నాన్న మండిపడ్డాడు.

''కాదునాన్నా! పరీక్షలకి లెటర్ రైటింగ్ వుందిగా సెలవులకి రమ్మని బంధువులకి తను చూసిన ఊళ్ళ గురించి రాయమని ఇలాంటి లెటర్లతో బోరుకొట్టి ఈ లెటర్ ప్రాక్టీస్ చేశా!''

''నోర్మూయ్! మూసెయ్యంతే డొక్క చీరుస్తా నంగనాచి వెధవా! నన్ను వాజమ్మని చెయ్యక చెప్పు. ఎవతికి రాశావో ఈ లెటరు?''

గరం మసాలా



తల్లిపాత్రలకు క్రేజ్

నటి నూతన్ ఈమధ్య కేన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయం చాలా మందికి తెలిసే వుంటుంది. నూతన్ ప్రస్తుతం నెమ్మదిగా కోలుకుంటోంది. ఈలోగా ఇతర తారామణులు చాలామంది తల్లిపాత్రల్లో నటించేస్తున్నారు. తల్లిపాత్రల్లో నటించే వాళ్ళలో నిరూపరాయ్, ఆశాపరేఖ్, రాఖీ కూడా చేరిపోయారు. ఇక ఇప్పుడు గ్లామర్ క్వీన్ డింపుల్ కపాడియా కూడా త్వరలో ఓ చిత్రంలో తల్లిపాత్రలో నటించనుందని వినికిడి. ఇదొక కొత్త క్రేజ్ కాబోలు. — ఎస్.

''ఎవరికీ రాయలేదు నాన్నా. సరదాగా రాసి పెట్టుకున్నా. నేనెవర్నీ ప్రేమించలేదు'' అన్నాను నంగినంగిగా.

''ఆ సంగతి నాకు తెలుసులేవోయ్ ప్రాష్టుడా! అందుక్కాదు నేనరిచేది ఈ లెటర్ ఒక్కసారి చూసుకున్నావా?'' అరిచాడాయన.

నాకు అర్థంకాలేదు. లెటర్ చూడ్డం ఏమిటి? రాసింది నేనైతే.

''అప్రాచ్యుడా! నిన్ను తెలుగు ఎం.ఎ చదివించి లెక్చరర్‌ని చేద్దామనుకున్నా. ఇలాగా తెలుగు రాసేది? పైగా కథలూ, కాకరకాయలంటావ్ కంత్రీ వెధవా? ఇదేనా నీ తెలుగు? 'నా అందమైన దేవతారాణీ' ఏమిట్రా నీ బొంద ఏమిటి? ఏమిటా పద ప్రయోగం? చంద్రుని కొరకు ఏదో పక్షిలాగానా? చాతక పక్షి చంద్రునికోసం ఎదురు చూస్తుందని తెలియదట్రా వెర్రి పీనుగా! నీ శక్తివంతమైన చూపులా? దరిద్రుడా 'శక్తివంతం' అనకూడదు శక్తిమంతం అనాలి. 'మన్మథబాణాలు'తో దకి ఒత్తుండాలిరా సన్నాసీ. నా గుండెల్లో తూట్లా? మనిషికి ఒక్క గుండేకాయ వుంటుందిరా! 'గుండెలు' వుండవు గుంట్రాయి వెధవా?''

ఏ ఉద్యోగం చేసేవాడికా బుద్ధులుంటాయిట. మా నాన్న నేను ప్రేమలేఖ రాసినందుకు తిట్టడంలేదు. నా ఉత్తరంలో తెలుగు సరిగా లేనందుకు తప్పు పడుతున్నాడు. ఈయనది భాషాపరమైన గోల. ప్చ్ తప్పు ఆయనదికాదు ఉద్యోగానిది.

''మిడి గుడ్లు వేసుకుని చూస్తావేరా? ఇంకా చూడు. జవాబు వ్రాస్తావు కదూ! అని రాశావు. వ్రాస్తావూ ఎందుకు? ఆ పలుకుబడులు ఇప్పుడు లేవు. రాస్తావు కదూ అని అఘోరించవచ్చు. ఏమిటీ 'యూ ఆర్ ఎ ఏంజిల్' తెలుగులో ఉత్తరం రాస్తూ మధ్యలో బోడి ఇంగ్లీషు కూడా ఎందుకు? పైగా అదీ తప్పే! ఎ ఏంజిల్ కాదు 'ఏన్ ఏంజిల్'. అనాలి, ఇంగ్లీషులో ఎ ఇ ఐ ఓ యులకుముందు ఆర్టికల్స్‌లో 'ఎ' రాదు. ఏన్ వస్తుంది. పైగా కింద అపభ్రంశపు కూత ఏమిటి? నీ చ ఏమిటి? నీచుడా! నువ్వు రాయకపోయినా ఈ ఉత్తరం చూసి నువ్వు నీచుడవని తెలుగు కూడా రాని దుంపనాశపు వెధవాయివని అయిదో క్లాసు చదివినోడికి కూడా అర్థమైపోతుంది. ఇలాంటి ఉత్తరాలు రాయడం నీకు చేతగాకపోతే తెలిసినవాడి చేత రాయించుకుని తగలడు. రేపెవరన్నా ఆడకూతురు ఈ ఉత్తరం చూసి నువ్వెవరి అబ్బాయివని అడిగితే తెలుగు మాష్టారి కొడుకునంటే నా పరువేంగాను. అలా నా పేరు చెప్పావంటే నాలుక చీరేస్తానారేయ్. ఫో వెధవా! ఈ ఉత్తరం యాభైసార్లు తప్పులు లేకుండా ఇంపోజిషన్ రాయి. దాన్ని చూసి రాయకపోతే తాటవలుస్తా! ఫో!'' ఉత్తరం విసిరి నా ముఖాన కొట్టాడు మానాన్న.

ప్రేమలేఖ రాసి ఏ సుందరికో ఇద్దామనుకున్న నేను బిక్కచచ్చిపోయి ఆ ఉత్తరాన్ని ఇంపోజిషన్ రాస్తూ కూర్చున్నాను!!!

** ** **

